

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర



(కంచుమర్రులో శ్రీనాన్నగారి ప్రవచనము, 27-9-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జ్ఞానయజ్ఞం, తపోయజ్ఞం, ద్రవ్యయజ్ఞం, స్వాధ్యాయ యజ్ఞం ఇవి అన్నీ యజ్ఞాలు. భగవంతుని గురించి పరస్పరం బోధించుకొంటూ ఉంటే, అంటే జ్ఞానం గురించి ఇతరులకు చెప్పగలిగితే చెప్పవచ్చు లేక ఇతరుల దగ్గర నుండి నేర్చుకోవచ్చు అది జ్ఞానయజ్ఞం. మీకు ఉన్న ధనాన్ని సద్వినియోగం చేస్తే అది ద్రవ్యయజ్ఞం. భగవంతుని నామమును మీరు శ్రద్ధగా జపిస్తే అది తపోయజ్ఞం. ఆధ్యాత్మిక గ్రంధాలు చదువుతూఉంటే భగవదనుభవం పొందటానికి సహకరించే గ్రంధాలు చదువుతూ ఉంటే అది స్వాధ్యాయయజ్ఞం. ఇవి అన్నీ యజ్ఞములే. కాని నీవు స్వార్థం లేకుండా, వ్యక్తభావన లేకుండా పనిచేయటం యజ్ఞం అని గీతలో భగవంతుడు స్పష్టంగా చెప్పాడు. భగవంతుడు చెప్పినమాటను మనం ప్రమాణంగా తీసుకోవాలి. మనస్సు వికశించాలంటే కేవలము కాలేజీ చదువులు సరిపోవు, ఆధ్యాత్మిక గ్రంధాలు చదివే అలవాటు చేయాలి. భగవంతుడు ఉన్నాడా, లేడా అని సందేహం పెట్టుకోకుండా భగవంతుడు ఒకడు ఉన్నాడు అనేకృతనిశ్చయం, సజీవమైన విశ్వాసం మీకు ఉంటే మీరు దురాచారులైనా తరిస్తారు అని భగవంతుడు చెప్పాడు. ఆనిర్ణయం బలంగా ఉండాలి సందేహం ఉండకూడదు. ఈప్రవచనాలు శ్రవణం చేయటంవలన జ్ఞానం రాకపోయినా మీకు లాభం ఏమిటి అంటే అజ్ఞానం ఎలా ఉందో మనకు తెలుస్తుంది.

మనం కుటుంబంలో వ్యవహరించినా, సమాజంలో వ్యవహరించినా మనజీవితం అంతాకూడా ఈ శరీరం శవమయ్యేవరకు నేను అనే తలంపును కేంద్రంగా పెట్టుకొని జీవిస్తాము. దానిని పోగొట్టుకోవటం మనకుఇష్టంలేదు ఎందుచేతనంటే అదే మనం అనుకొంటున్నాము. అందుచేతనే శ్రవణం చేయాలి. శ్రద్ధగా శ్రవణం చేస్తే కొన్ని అయినా అర్ధమవుతాయి. మానవుడు బుద్ధికి పనిచెప్పడు. మనకు వివేకం చాలముఖ్యం. వివేకం పొగొట్టుకొంటే నీవు అన్ని రంగాలలో పాడైపోతావు అని భగవంతుడు గీతలో చెప్పాడు. మన మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతోంది. లోపలకు పంపటం మనకు ఇష్టమేగాని అది వెళ్ళటం లేదు. నీకు లోపల ఉన్న పరమేశ్వరుడి మీద భక్తి, ప్రేమ, విశ్వాసం కుదిరితే ఆయన మన మనస్సును బయటకు వెళ్ళకుండా లోపలకు గుంజేస్తాడు. మీకు భగవంతుడి మీద విశ్వాసం, ఇష్టంలేదు అనుకోండి మనస్సు బయట తిరగటం మానదు. బయటే తిరుగుతుంది బురద చేసుకొంటుంది, స్నానం చేయిస్తాము, మరల బయటకు వెళ్ళి దుమ్ము చేసుకొంటుంది. పనికి, జ్ఞానానికి విరోధంలేదు. నీవు పనిచేస్తూ ఉండాలి. నీమనస్సు ఈశ్వరుడిమీద ఉండాలి. మనస్సుకు ఆవిధంగా శిక్షణ ఇవ్వాలి. అది ఎప్పడు సాధ్యమవుతుంది అంటే నీకు ఇష్టం ఉంటే సాధ్యమవుతుంది. మీ మనస్సు ఎలా పనిచేస్తోందో మీకు తెలియాలి. అత్తవారింటి దగ్గరనుండి బంధువులు వస్తే మీ మనస్సు ఎలాఉంది, పుట్టింటి దగ్గరనుండి బంధువులు వస్తే మీ మనస్సు

ఎలా ఉంది అని మనస్సును మీరుచూసుకోవాలి. వీరు అందరూ చుట్టాలే కాని వీరందరి కంటే పెద్ద చుట్టం ఈశ్వరుడు. ఈ చుట్టాలు అందరూ ఈదేహం ఎంత నిజమో వారు కూడా అంతే నిజం. అందువలన నీదేహం ఎక్కడ ఉన్నా నీమనస్సు ఈశ్వరుడి మీద వాలుతూ ఉండాలి. అప్పడు సహజంగా నీ మనస్సు కరగటం ప్రారంభిస్తుంది.

నేను అనే మొదటి తలంపు ఉంది కాబట్టి ఇతర తలంపులు వచ్చి నీమీద పెత్తనం చేస్తున్నాయి. ఆమొదటి తలంపు నశించేవరకూ సంసారం ఆగదు. మీరు చేసేపని, మాట్లాడేమాట ఆమూలతలంపును రెచ్చగొట్టేలా ఉండకూడదు. మూలతలంపును మీరు పట్టించుకోకుండా ఉంటే దాని అంతటఅదే దానిమూలంలోనికి వెళ్లికరిగిపోతుంది. నేను ఎవడను? అనే ప్రశ్నసాధన. దానికి సమాధానం సిద్ధి. మొదటి తలంపు అనేది నీస్వంతసమస్య. దానిని నీవే పరిష్కారం చేసుకోవాలి. దానిని ప్రయత్నం చేసి తొలగించుకోకపోతే ప్రతిజన్మ లోనూ బాధ నిన్ను వెంటాడుతుంది. దేహం ఎందుకు వచ్చింది కేవలం బట్టకట్టుకోవటానికి, తిండి తినటానికి రాలేదు, ప్రారబ్దం అనుభవించటానికి వచ్చింది. ప్రారబ్దం మీకు కొన్ని పాఠాలు నేర్పుతుంది. ప్రారబ్దం మీకు అనుకూల పరిస్థితులు, వ్యతిరేఖ పరిస్థితులు తీసుకొని రావచ్చు అప్పడు మీ శాంతి చెదరకుండా ఉంటే మీరు అదృష్టవంతులు. మీకు బాగా చదువు వచ్చింది అనుకోండి. అది నిత్యం కాదు అనుకోండి. మీకు ఏదైనా గొప్పపదవి వచ్చింది అనుకోండి అది నిత్యం కాదు అనుకోండి. శరీరమే నిత్యం కానప్పడు ఈసంఘటనలు ఎలా నిత్యమవుతాయి. అయితే అవి ఎందుకు వస్తున్నాయి. అంటే నీకు పాఠాలు నేర్పటానికి వస్తున్నాయి. నేర్చుకొన్నవాడు అదృష్టవంతుడు, నేర్చుకోవటం చేతకానివాడు దురదృష్టవంతుడు. అవకాశములు అందరికి వస్తాయి. వచ్చిన అవకాశములను ఉపయోగించుకొంటే వాడిని తెలివైన వాడు అంటారు, అవకాశములను జారవిడుచుకొంటే వాడిని తెలివి తక్కువ వాడు అంటారు. ఇతరుల గురించి ఆరాతీయకు ఈ నేను అనే తలంపు నీలోపల ఎక్కడనుండి వస్తోంది అని ఆరాతీసుకొంటే నీవు బాగుపడతావు. నీవు పొందవలసినది ముందు పొందు అప్పడు నీ ద్వారా లోకానికి ఎంతో మేలు జరుగుతుంది.

భగవంతుడు నీ శరీరానికి ఏ ప్రారబ్దం ఇచ్చాడో ఆ పని చేసుకొంటూ నీ లక్షాన్ని గుర్తు పెట్టుకోవాలి. నీ గమ్యం కోసం నిర్విరామంగా కృషి చేయాలి. అహంకారమే మనం అనుకొంటున్నాము. అందువలన దానిని పోగొట్టుకొనే ప్రయత్నం చేయటం లేదు. మాయ అంతా ఇక్కడే ఉంది. దేహం చనిపోయేవరకూ దాని చుట్టూ తిరుగుచున్నాము. శరీరానికి రూపం ఉందిగాని అహంభావనకు రూపం లేదు. ప్రతీ జన్మలోను ఏదో రూపాన్ని, ఏదో నామాన్ని పట్టుకొని ఉంటుంది. అది మనల్ని విడిచిపెట్టదు. ఏదో గురువు అనుగ్రహం వలన, ఈశ్వరుని కృపవలన అది మనలను విడిచి పెట్టాలిగాని కేవలం మన తెలివి తేటలవలన అదిపోదు. తప్పలు చేయటం, ఆతప్పలు దిద్దుకొంటున్నాము అని నోటితో అనటం వలన అవి ఆగవు. లోపల పశ్చాతాపం ఉంటే ఆ తప్ప తిరిగి చేయడు. ఇప్పడు మీరు శ్రద్ధగా శ్రవణం చేస్తున్నారు. ఇప్పడు మీకు ఇతర తలంపులు లేవు. ఇంటికి వెళ్లిన తరువాత ఇతర తలంపులు అన్నీ వచ్చేస్తాయి కారణం ఏమిటి అంటే మొదటి తలంపు అలాగే ఉంది. మొదటి తలంపు ఉన్నంతసేపు అనేక తలంపులు వస్తాయి. మంచి తలంపులు రావచ్చును, చెడు తలంపులు రావచ్చును. మొదటి తలంపు నశిస్తేనేగాని జ్ఞానసింహాసనం మీద కూర్చోలేరు, ఈశ్వరుని

స్వరూపమును పొందలేరు. నన్ను ఎలా బ్రతకమంటారు అని భగవాన్‌ను అడిగితే చచ్చినవాడిలా బ్రతుకు అనేవారు భగవాన్. అంటే నీ దేహం ఉండాలి నీవు చనిపోవాలి. అప్పడు నీవు జ్ఞానివి అవుతావు. భగవాన్ బోధకు, ఉపనిషత్‌ల బోధకు తేడా ఏమిటి అంటే రెండు ఖాళీ డబ్బాలు తీసుకొని ఒకదానిలో ఒకకాసు బంగారం వెయ్యండి. రెండో డబ్బాలో బంగారంతో పాటు కొన్ని రాళ్ళు వేయండి. రెండింటిలోనూ బంగారం ఉంది కాని రాళ్ళు లేని డబ్బాలో చెయ్యిపెట్టి బంగారాన్ని వెంటనే తీసుకోవచ్చు. భగవాన్ బోధ ఇలా ఉంటుంది. రాళ్ళు ఉన్న డబ్బాలో కూడా బంగారం ఉన్నా చెయ్యి పెట్టి రాళ్ళను గెంటుకొని గెంటుకొని బంగారాన్ని తీసుకోవాలి. ఉపనిషత్‌ల బోధ ఇలా ఉంటుంది అని చలంగారు చెప్పారు.

(జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 11-10-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాగం వలన, ద్వేషం వలన, భయం వలన, కోపం వలన మనకు దుఃఖం వస్తుంది. ఏకారణములవలన మానవుడికి దుఃఖం వస్తుందో ఆకారణములను విడిచిపెట్టమని భగవంతుడు చెప్పాడు. మమకారం వేరు, ప్రేమవేరు. మమకారాన్ని మనం ప్రేమ అనుకొంటున్నాము. మనకు మమకారం ఉందిగాని ప్రేమలేదు. ఒక్క జ్ఞానికి తప్పించి అందరికి ఏదోభయం ఉంటుంది. భయాలు చాలా ఉన్నాయి కాని అన్నింటికంటే మరణ భయం పెద్దది. మనం చిరకాలం జీవించాలని అనుకోకూడదు, తొందరగా మరణించాలని అనుకోకూడదు. ఇది మనస్సులో ఉన్నదోషం. అలాగ అనుకోకూడదు, ఇలాగ అనుకోకూడదు ఈశ్వర నిర్ణయానికి విడిచిపెట్టాలి. భగవంతుని మీద భారంవేసి జీవించేవాడికి మిగతాభయాలు తగ్గుతాయి, మరణభయం కూడా తగ్గుతుంది. భగవంతుని మీద భారంవేసి జీవించేవాడికి జ్ఞానం కలుగుతుంది. శరీరంలో చాలా అవయవాలు ఉన్నాయి. అన్నింటిని జ్ఞానం సంపాదించటానికి ఉపయోగించుకొంటే జ్ఞానం కలుగుతుంది. మనిషి ఎన్నో కష్టాలు, బాధలు అనుభవిస్తేకాని వినయం, వివేకం, విచక్షణరాదు. మనకు తెలివి, ధనం, చదువు ఉన్నంతమాత్రం చేత వినయం విచక్షణరాదు. నీరు పల్లానికి ఎలా వెళుతుందో అలాగ వినయం ఉన్నచోటికి జ్ఞానం వెళుతుంది. మాట అణగనివాడు, మనస్సు అణగనివాడు చెప్పినది వింటే అది శ్రవణం కాదు, ఆత్మానుభవం పొందినవాడు చెప్పేది మీరు వింటే అది శ్రవణం అవుతుంది.

గాఢనిద్రలో నేను ఉందికాని నేను అనే తలంపు లేదు. గాఢనిద్రలో ఉన్న నేనుకు పరిమితులు లేవు. అది నిజమైననేను. నేను అనే తలంపు దేహానికి పరిమితమై దేహంతో తాదాప్యం పొంది ఉంటుంది. భౌతికమైన దేహం అగ్నికి ఆహుతి అవ్వకముందే దేహానికి పరిమితమైన నేనును ఎవడైతే తొలగించుకొంటాడో వాడు జన్మలేని స్థితిని పొందుతాడు. మనం జాగ్రదావస్థలోనికి వచ్చేటప్పటికి నేను అనే తలంపువస్తుంది. ఇది గాఢనిద్రలో ఉన్న నేనులో నుండే వస్తోంది. జాగ్రదావస్థలో సాధనచేసి ఈనేను అనే తలంపును పోగొట్టుకొంటే గాఢనిద్రలో ఉన్న నిజమైన నేను నీకు జాగ్రదావస్థలో వ్యక్తమవుతుంది. అదే చివరస్థితి, అదే స్వర్గరాజ్యం, అదేనిర్వాణస్థితి. ఇప్పడు దేహం నేను అనే తలంపు మనకు ఎలా వస్తోందో అలాగ ఆత్మ నేను అనే తలంపు అనుభవంలోనికి వచ్చేవరకు దాని తాలుకా ఆనందం, సుఖం నీవు పొందలేవు. ఆత్మానందం కలిగేవరకూ జననమరణచక్రంలో నుండి బయటకు

రాలేవు. చనిపోయినవారు పుడతారు, పుట్టిన వారు చనిపోతారు. నీహృదయంలో ఉన్న ఆనందం, శాంతి నీకు అందేవరకు ఈ చక్రంలో తిరుగుతూ ఉంటావు. కోటిజన్మలు ఎత్తినా బయటకు రాలేవు. ఎందుకు బయటకు రాలేవు అంటే ఆత్మానందం నీకు అందేవరకూ చిల్లర సుఖాలను, చిల్లర విషయాలను నీమనస్సు కోరుతూఉంటుంది. నీవు దేహం లేకుండా చిల్లర సుఖాలను ఎలా అనుభవిస్తావు. మీకు భోగం మీద దృష్టి ఉన్నంత కాలం దేహం వస్తుంది ఎందుచేతనంటే దేహం లేకుండా భోగం అనుభవించలేడు. దేహంతో సంబంధం లేని ఆనందం అంటే ఆత్మానందం అనుభవంలోనికివస్తే అప్పుడు నీకుదేహంతో పని ఉండదు కాబట్టి దేహం రాదు. మనకు జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషిప్తి అని మూడు అవస్థలు ఉన్నాయి. ఈమూడు అవస్థలలో ఆత్మ సమానంగా ఉంది. ఈ మూడు అవస్థలలో సమానంగా ఉన్న ఆత్మను ఎవడైతే అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడు తురీయస్థితిని పొందాడు అంటారు. దానిని ఎవరూ నోటితో చెప్పలేరు.

ఒకదేహంతోటి, ఒకరూపంతోటి, ఒకనామంతోటి తాదాప్యం పొందుతున్నంతకాలం అహంభావన నశించే అవకాశంలేదు. నీకు పరిమితులు వస్తాయి. నామరూపములనుండి విడుదల పొందితే గాని మీరు దుఃఖం నుండి బయటకు రాలేరు. బయట ఉన్న భర్తలు మాయ భర్తలు, నీలోపలున్న సత్యవస్తువే నిజమైన భర్త అంది మీరాబాయి. పతి ఒక్కడే వాడే ఈశ్వరుడు. నామరూపముల చుట్టూ తిరుగుతున్న మనస్సుకు అంతర్దృష్టి కలుగజేయాలి. శాస్త్రాన్ని శ్రద్ధగా శ్రవణం చేస్తే, మహాత్ముల మాటలు వింటే అంతర్దృష్టి కలుగుతుంది. మీకు ఎప్పుడైనా దుఃఖం వస్తే భగవంతుడు కారణం అనుకోవద్దు. ఆయన పవిత్రుడు, పరిశుద్ధుడు. మీకు దుఃఖం తీసుకొనిరావాలి అని ఆయన అనుకోడు. మీరు పూర్వజన్మలో దేహబుద్ధితో చేసిన చెడ్డపనులే మీకు దుఃఖంగా వస్తున్నాయి, మంచిపనులే సుఖంగా వస్తున్నాయి. మీరు చేసిన పనులే మిమ్మల్ని వెంటాడుతున్నాయిగాని దేవునికి ఏమీ సంబంధంలేదు. ఆయనను ప్రార్థిస్తే దుఃఖకారణములు తీసేస్తాడు. నీఅలవాట్లు సరిగాలేకపోతే, నీప్రవర్తన సరిగా లేకపోతే అవే నీకు దుఃఖమును తీసుకొని వస్తాయి. పాజిటివ్‌గా ఉండటం నేర్చుకొంటే దుఃఖంలో నుండి బయటపడతావు. ఏదైతే సత్యవస్తువో దేనిగామనం ఉన్నామో దానిలోనుండి, ఐక్యభావనలో నుండి వేరుపడటం మానవుడు చేసిన పొరపాటు. అసలు వస్తువునుండి వేరుపడటమే మనం చేసిన పొరపాటు. దానివలన అనేక పొరపాట్లు రావచ్చును. మీరు నిరంతరము భగవంతుని స్మరణలో ఉంటే, భగవంతుని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తే అహంభావన నశిస్తుంది. ఎవరైనా మీకు అనుకూలంగా ప్రవర్తించినా, వ్యతిరేఖంగా ప్రవర్తించినా భగవంతుడే అలాచేస్తున్నాడు అనుకొంటే మీకు హెచ్చుతగ్గులు పోతాయి. మనస్సులో ఉన్న వంకరలు పోతాయి. ఎవరైనా విమర్శించినా, స్తోత్రం చేసినా చేయించేది భగవంతుడే అని భగవంతుని స్మరణలో ఉంటే అహంభావన దాని అంతట అదే రాలిపోతుంది. ఎవడిమనస్సు అయితే అణిగిందో వాడిలో నుండి వచ్చే వాక్కు చల్లగా ఉంటుంది, దానికి శక్తి ఉంటుంది. మనస్సు అణగకపోతే వాడిలో నుండి వచ్చే వాక్కు చల్లగా ఉండదు. పవిత్రంగా ఉండదు, మీహృద యంలో ప్రవేశించలేదు. మాటలో శక్తి లేకపోతే, పవిత్రత లేకపోతే అది మీహృదయంలో ప్రవేశించి మీ జీవితంలో మార్పు తీసుకొనిరాలేదు. మీద్వారా ఏది జరిగినా భగవంతుడే పనిచేస్తున్నాడు అనుకొంటే మీకు భగవదనుభవం కలుగుతుంది.